# రాజధర్మం



*అదండ్యాన్ దండయన్ రాజా*

*దండ్యాంశ్చై వాప్యదండయన్*

*అయశో మహదాప్నోతి*

*నిరయం చాభిగచ్ఛతి*

***భావం:*** దండించవలసిన వారిని దండించకుండా, శిక్షింప తగని వారిని శిక్షించే రాజు అపకీర్తిని పొందుతాడు. అంతేకాక నరకానికి వెళతాడు.

రాజ్యంలో ప్రజలందరూ పండుగ చేసుకుంటున్నారు. గజదొంగ గంగులు తన చోర బృందంతోసహా రాజభటులకు దొరికిపోయాడు. గంగులు

మామూలు దొంగ కాదు. సాధారణంగా దొంగలు ఇంటికి కన్నం వేసో, ఇంట్లో ఎవరూ లేనప్పుడు తాళం బద్దలు కొట్టో ధనమూ, విలువైన వస్తువులూ పట్టుకుపోతారు. ఏమరుపాటుగా ఉన్నవారి వద్దనున్న ధనాన్ని హస్తలాఘవంతో తస్కరిస్తారు.

కానీ గంగులూ, అతని అనుచరబృందమూ ప్రాణాలు తియ్యడానికి వెనుకాడేవారు కాదు. సొమ్ము తస్కరిస్తూంటే ఇంటి యజమాని కానీ, ఇంట్లో వారు కానీ అడ్డు వస్తే చంపేసేవారు. అడ్డు రాని వారిని కూడా తమను గుర్తించుకుంటారన్న అనుమానంతో హతమార్చే వారు. నేటి ప్రయాణ సాధనాలు లేని ప్రాచీన కాలంలో యాత్రికులు బృందాలుగా పయనించేవారు. ఆ బృందాలను చంపి వారి ధనాన్ని గంగులూ, అతని అనుచరులూ దోపిడీ చేసేవారు. రాజ్యంలో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన గంగులు వల్ల ఇక భయం లేదనీ, మహారాజు దొంగలందరికీ మరణ శిక్ష విధిస్తాడనీ ప్రజలనుకున్నారు.

ఆ సంతోష సమయంలో దుఃఖిస్తున్న కుటుంబాలు కూడా ఉన్నాయి. గంగుల్ని చెరపట్టడం సామాన్యమైన పని కాదు. ఆ ప్రయత్నంలో కొందరు రాజభటులు ప్రాణాలర్పించారు. వారి ఇళ్లల్లో ఆత్మీయులు పోయిన దుఃఖమూ, ప్రజా రక్షణలో ప్రాణాలు అర్పించాన్న తృప్తీ సమపాళ్లలో ఉన్నాయి. గంగులూ, మిగిలిన దొంగలూ మరణదండన పొందితే ప్రజలు భద్రంగా ఉంటారన్న ఆశ వారిలో దీపంలా వెలుగుతోంది.

గంగుల్నీ, మిగిలిన దొంగల్నీ విచారించే రోజు వచ్చింది. మహారాజే న్యాయాధీశ పీఠంపై కూచున్నారు. నేరాలు పెద్దవి కనుక ఆయనే విచారణకు పూనుకున్నారు. రాజభటాధ్యక్షుడూ, గూఢచారి సంఘ నాయకుడూ నేరాలను రుజువు చేశారు. మహారాజు తీర్పు చెప్పే సమయానికి ఒక సన్యాసి సభలో ప్రవేశానికి అనుమతి కోరాడు. రాజు లోపలకు పంపమని ఆనతిచ్చాడు. సన్యాసి కొందరు స్త్రీలతో, పిల్లలతో సభలో ప్రవేశించి, 'రాజా, ఈ నిర్భాగ్యులని

చూడండి. గంగుల్నీ అనుచర గణాన్నీ మరణశిక్షకు గురిచేస్తే ఈ స్త్రీలు వితంతువులవుతారు. ఈ పిల్లలు దిక్కులేనివారవుతారు. వారిని క్షమిస్తే ఈ అమాయకులను కాపాడిన వాడివవుతావు' అన్నాడు. మహారాజు మనస్సు కరిగింది. మరణశిక్ష కాకుండా యావజ్జీవ కారాగార శిక్ష విధించాడు. రాజభటాధ్యక్షుడూ, గూఢచారిసంఘ నాయకుడూ, వారి కింద ఉద్యోగులూ కోపంతో రగిలిపోయారు. మరణించిన రాజభటుల కుటుంబాలు తమ ఆత్మీయుల త్యాగం వ్యర్థమని కుమిలికుమిలి ఏడ్చాయి.

కొన్ని నెలలు గడిచాయి. గజదొంగ గంగులు అనుచరులతో కలిసి కారాగారం నుంచి తప్పించుకుని పారిపోయాడు. కారాగృహ రక్షకుల తలలు ఎగరగొట్టి మరీ పారిపోయాడు. దేశంలో దొంగతనాలూ, దోపిడీలూ హత్యలూ మొదలయ్యాయి. మహారాజుకి నిద్ర పట్టలేదు. క్షమాగుణంలో, దయాహృదయంలో తప్పేమిటని ఆలోచిస్తున్న ఆయనకు చిన్ననాడు గురువులు నేర్పిన రాజనీతి గుర్తుకు వచ్చింది. దండించతగిన వారిని వదలివెయ్యడమూ, శిక్షింపతగని వారిని శిక్షించడమూ రాజు చెయ్యరాదు. తాను తప్పు చేశాడు. క్షమా గుణానికైనా హద్దులుండాలి.

ఈ కథ నేడూ జరుగుతున్నదా? పాలకులూ, పాలితులూ కూడా ఆలోచించాలి.

******